
# సొంత లాభం

-వియోగి

"రావుగారూ! ఓ యాభై అర్జెంటుగా కావాలండీ! ఫస్టుకిచ్చేస్తాను." సుధాకర్ అడుగుతున్నాడు గుమ్మంలో నిలబడి.

రావుకు చిరాకేసింది అప్పు అడగడానికి అంతసేపు బజర్‌కొట్టి - తన్ను నిద్రలేపాడు. అతని కళ్ళు ఎర్రగా ఉన్నాయి. నిజానికి యాభై పెద్ద లెక్కలోంది కాదు.



"అప్పు అడగడానికి వేళాపాళా లేదా? ఇంతరాత్రి పూట నిద్రలేపాలా? బుద్ధిలేదూ?" కోపంగా అన్నాడు రావు.

"సారీ! రాత్రి పదైంది. ఇంకా నిద్రపోయుండరనుకొని బజర్ నొక్కాను." సంజాయిషీ చెప్పాడు.

"అనవసరంగా నిద్ర పాడు చేశావు" ఇంక పొమ్మన్నట్లు తలుపును పట్టుకున్నాడు రావు.

"ప్లీజ్! ఓన్లీ ఫిఫ్టీ రుపీస... మల్లికను ఆసుపత్రికి తీసుకుపోవాలి. సడెన్‌గా జ్వరం వచ్చింది." సుధాకర్ బాధపడుతూ అసలు కారణం చెప్పాడు.

రావుకు అది నమ్మబుద్ధి కాలేదు - పైగా నిద్ర పాడు చేశాడు.

"సారీ! నేనేండబ్బులు మూటగట్టుకుని కూర్చోలేదు. నా దగ్గర లేవు." చాలా గట్టిగా చెప్పాడు.

సుధాకర్ మొహంలో నిరాశ స్పష్టంగా కనిపించింది.

"మన ఫ్లాట్లలో నాకు పరిచయమున్న వాళ్ళందర్నీ అడిగాను - చివరిగా మీ దగ్గర ఖచ్చితంగా దొరుకుతుందని ఆశతో వచ్చాను."

"చెప్పానుగా - ఇంకెక్కడైనా ట్రై చేయండి."

"ఓ.కే. సార్. నాలక్ బాగోలేదు." నిరాశగా వెళ్ళిపోయాడు.

రావుకు జాలి కలిగింది. వెనక్కిపిల్చి ఇద్దామనుకున్నాడు కాని అదే అలవాటవుతుందని భయమేసి ఆగిపోయాడు.

★ ★ ★

రావు ఆఫీసులో సీరియస్‌గా పనిచేసుకుంటున్నాడు. వాసు ఉరుకుల పరుగులతో వచ్చాడు.

"గురూ! నీ స్కూటర్ కావాలి గురూ! ఈ ఒక్క రోజుకు."

"వాసూ! కమాన్! టేకిటీజ్! ఏంటి హడావిడి!" మనసులో బాధ పడ్తూ అసలు విషయం ఏమిటో కనుక్కుందామని అడిగాడు.

"ఏం లేదు. కొంచెం... టౌన్లో పన్లున్నాయి. నేను మళ్ళీ ఊరికెళ్ళాలి. అందుకని స్కూటరకీస ఇస్తే..."

వాసు మొహం చెమటతో తడిసిపోయి ఉంది.

"నా స్కూటర్ కండిషన్‌లో లేదు. బ్రేకుల్లేవు. గేర్లు సరిగ్గా పడటం లేదు. నిన్నే మెకానిక్‌కి చూపిస్తే ఇవ్వాళ్ళ రమ్మన్నాడు." నోటికొచ్చిన అబద్ధం చెప్పాడు.

నిజానికి వాసు, రావుకు చాలా మంచి స్నేహితుడు. దురదృష్టం కొద్దీ వాసుకు వెహికల్ లేదు. కొనగలిగిన శక్తి ఉన్నా కొనుక్కోలేదు. వృత్తి రీత్యా తను అనంతపురంలో ఉంటాడు. పుట్టినూరు కాబట్టి వస్తూపోతూ ఉంటాడు.

రావుకు తన స్కూటర్ ఎవరికీ ఇవ్వడం ఇష్టం ఉండదు. అదీగాక అవసరం కూడా తనకు.

"గురూ! నాకు తెలీదు. నేను జాగ్రత్తగా వాడుకుని రాత్రికి మీ ఇంటికి తెచ్చిస్తా - తొందరగా వెళ్ళాలి." వాసు కుర్చీలోంచి లేస్తూ అడిగాడు.

"అదికాదు వాసూ - కొంచెం నా మాట విను. ఈ రోజుకు ఆటోలో పో...సర్వీసు చేయించి రేపు తెస్తాను. కావాలంటే రేపు వాడుకో!" రావు అన్నాడు.

"అరే బ్రదర్! నాకుకావాల్సింది ఈరోజు. రేపు ఊళ్ళో కూడా ఉండను." విసుక్కుంటూ చెప్పాడు.

"పోనీ ఓ పని చెయ్యి. మనసూరిగాడు ఈ మధ్యే కొత్తగా మోటార్ సైకిల్ కొన్నాడు. తొక్కడం రాక పూజ చేస్తున్నాడు. వాణ్ణి అడుగు" రావు పాచిక విసిరాడు.

"ఆహా! నాకు తెలీదే! సరే...వాణ్ణే అడుగుతాను." వాసు వెళ్ళిపోయాడు వెనుదిరిగి చూడకుండా. రావు చిన్నగా నవ్వుకున్నాడు తనపాచిక పారినందుకు. స్కూటర్ ఇస్తే రెండు రకాలనష్టాలు.... అది పాడైతే తనే రిపేరు చేయించుకోవాలి. పెట్రోలు అయిపోతే వేయించుకోవాలి.

★ ★ ★

ఓ ఆదివారం విశ్రాంతి తీసుకుంటున్నాడు రావు. ఎంతో ఆందోళనపడ్తూ ఫణి వచ్చాడు.

"రా ఫణీ... పద్మా ఓ కాఫీ!" సంతోషంగా ఆహ్వానిస్తూ లోపలికి కేకవేశాడు.

ఫణి వారి కుటుంబస్నేహితుడు. తరచూ వస్తూ పోతూ ఉంటాడు.

పిచ్చాపాటీ దొర్లిపోయింతర్వాత అసలు విషయానికి వచ్చాడు ఫణి.

"రావూ - నాకో చిన్న సహాయం కావాలి... కమలా నగరంలో నా ఇల్లుంది కదా - నా స్థలంలో అవతలి జాన్‌గాడు కాంపౌండ్ వాల్ కట్టాడు - మళ్ళీ దానిపైన రూఫ్ కూడా వేశాడు - నా స్థలం యాభై అడుగులు వాడు ఆక్రమించాడు. ఈ రోజు పెద్ద మనుషుల పంచాయితీ జరుగుతుంది - నువ్వొచ్చి..." తన బాధ చెప్పుకు పోయాడు.

"అరే! యూజ్ లెస్ ఫెలో - అలా ఎలా కట్టనిచ్చావు. నేనైతే కాళ్ళూ చేతులూ విరగకొట్టేవాణ్ణి. వాడు అంతు చూసేవాడిని." తారాస్థాయికి లేచాడు రావు.

"అద్దెకున్న వాళ్ళు నాకు చెప్పలేదు - మొన్న అద్దెకోసం పోయినప్పుడు చూసి అడిగితే నీకు దిక్కున్న-చోట చెప్పుకో మన్నట్లు మాట్లాడాడు జాన్... మనం సుఖంగా బ్రతుకుతూంటే - ఇరుగు పొరుగువాళ్ళు మనల్ని సుఖంగా బ్రతకనివ్వరు."

"ఫణీ! అసలు కోర్టుకు ఈడ్చుకపోయావా వెధవని." సలహా ఇచ్చాడు.

"ఏం లాభం! న్యాయాన్ని మనం కొనుక్కోవాలి. ఊరికే లభించదు." వాపోయాడు.

"వాట్! న్యాయం అమ్ముడుబోతోందా?"

"మరి కాకపోతే ఏమిటి? మనది ఒప్పు - న్యాయం మనవైపు ఉందని తెలిసినా - అది విడమర్చడానికి ఓ న్యాయవాదిని డబ్బిచ్చి పెట్టుకోవాలి - ఆ కోర్టు వాయిదాలు వేస్తూ ఉంటే - నెలలు తరబడీ - జేబులు ఖాళీ చేసుకుంటూ తిరగాలి. ఆ తర్వాత జడ్జీగారు సహృదయంతో తీర్పు ఇచ్చారే అనుకో - దాన్ని అమలు చేయించుకోడానికి మళ్ళీ కోర్టును ఆశ్రయించాలి మళ్ళీ ఖర్చు - ఇంత అయింతర్వాత కూడా మనకు న్యాయం జరుగుతుందని నమ్మకముందా? అవతల వాడుపై కోర్టుకు పోయి స్టే తీసుకురావచ్చు - ఇలా చాలా బాధలు ఉన్నాయిలే." [illegible]ప్పు మొహంతో చెప్పాడు.

"సరే ఇవన్నీ ఎందుకూ - పెద్ద మనుషులతో చెప్పి - వాడికి గడ్డి పెట్టిద్దాం - పద" అన్నాడు రావు.

"ఏవండీ - ఒకసారి ఇలా వస్తారా?" పద్మకేక వేసింది లోపలినుండి.

రావు ఉరుక్కుంటూ లోపలికి వెళ్ళాడు.

"ఎక్కడికి పోతున్నారు?"

"అదే! ఆ ఫణిగాడి స్థలం దగ్గరకు."

"మీకేమైనా మతి పోయిందా - లేనిపోని గొడవల్లో ఎందుకు తలదూరుస్తారు? కడుపులో చల్ల కదలకుండా ఉండలేరు?" కోపంగా అంది.

"అది కాదే... ఫణికి పాపం ఎవరూ లేరు. కనీసం నేనన్నా పోయి - ఆ పెద్దమనుషుల దగ్గర సాక్ష్యం ఇచ్చి - కొంచెం సాయం చేస్తాను." నసిగాడు.

"బుద్ధి లేకపోతేసరి - ఇంత వయసు వచ్చి గొడవలు పడ్డం ఏమిటండీ - ఫణి చావు ఫణి చేస్తాడు - మీకెందుకు? జాన్‌గాడు ఎటువంటివాడో - వాడుపెద్ద రౌడీ అని నేను విన్నాను. వాడు మిమ్మల్నేమన్నా చేస్తే నా బ్రతుకూ, పిల్లల బ్రతుకూ ఏంగాను? అయినా కాని పనికి. కానీ రాని పనికి పోవద్దని మన పెద్దలు చెప్పలేదూ?" కోప్పడింది ఎంతో మెత్తగా.

రావుకొచ్చిన ఆవేశం చల్లారిపోయింది. ఆలోచనలో పడ్డాడు. జాన్ అంటే భయం వేసింది. ఫణిమీద కోపం వచ్చింది అనవసరంగా తన్ను ఈ జంజాటంలోకి లాగుదామని చూస్తున్నందుకు.

బయటకు వచ్చాడు - ఫణి వెళదామని చూశాడు అతనివంక.

"చూడు ఫణీ! నేను నా ప్రోగ్రాం మర్చిపోయాను. మేము ఓ రిసెప్షన్‌కు వెళ్ళాలి. మా ఆవిడ కొలీగ్ పెళ్ళయ్యింది. వెళ్ళకపోతే బాగుండదు - అందుకనీ."

"ఎంత ఓ గంటచాలు..." ఆశగా అన్నాడు ఫణి.

"కాదురా... సారీ.... నువ్వెళ్ళు" ఖచ్చితంగా చెప్పి అతన్ని పంపించేసి ఊపిరి పీల్చుకున్నాడు.

కొన్ని రోజుల తర్వాత...

పద్మకు యాక్సిడెంట్ అయ్యింది. ఆఫీసునుంచి వస్తూ ఉంటే బస్సు ఢీ కొట్టింది. కొంచెంలో ప్రాణాపాయం తప్పింది.

కాని హాస్పిటల్‌లో మంచం మీద ఉంది. ఆపరేషన్‌కు ట్రీట్‌మెంటుకు వేలకు వేలు ఖర్చయిపోయాయి. ఆ బస్సు వాడిమీద కేసు పెడదామని ప్రయత్నిస్తే ఎవ్వరూ సహకరించడం లేదు.

వాసూ వచ్చాడని తెల్సి అతన్ని కలిశాడు. వాసు తన తరపున సాక్ష్యం చెబుతాడని ఆశపడి తన గోడు వెల్లడించి, చివరిగా ఆ బస్సుపైన - బస్సు ఓనరుపైన నష్టపరిహారం కోసం కేసు వేస్తే ఎలా ఉంటుందని అడిగాడు.

"పిచ్చి వాడా! నేనే నీ స్థానంలో ఉంటే నోర్మూసుకుని కూర్చుం టాను. ఆ బస్సు ఓనరు పెద్ద పాలెగాడు. వాడి జోలికి ఎందుకు పోతావు - అయిందేదో అయింది. పిచ్చి పన్లు చేసి గొంతుమీదకు తెచ్చుకోమాకు." వాసు చెప్పాడు.

"అంతే నంటావా!" అని చెప్పి వచ్చేశాడేగాని రావుకు వాసుమీద కోపం గొంతు దాకా వచ్చింది.

స్నేహితుడికి కాస్త కూడా సహాయం చేయలేని వెధవ బ్రతుకు అని తిట్టుకున్నాడు.

ఆ రోజు డాక్టర్లు అర్జెంటుగా మెడిసిన్లు కావాలని మందులు రాసిచ్చారు - చిల్లిగవ్వకూడా లేదు చేతిలో. సుధాకర్ కనిపిస్తే ఆశగా అడిగాడు ఓ రెండొందలు ఇమ్మని.

"సారీ రావుగారూ! మీ బాధ అర్థం చేసుకోగలను - కాని నా దగ్గర డబ్బులేదు - ఇంకెక్కడన్నా ప్రయత్నించండి." సుధాకర్ అతని మాట వినిపించుకోకుండా వెళ్ళిపోయాడు.

రావు అతని జేబులో ఉన్న పచ్చనోట్లని చూశాడు అతను వేసుకున్న తెల్ల చొక్కా జేబు పుణ్యమా అని.

"ఛీ! ఏం మనుషులు డబ్బుంచుకొని లేదంటారు" చీదరించుకున్నాడు సుధాకర్ పైన - మానవత్వం లేని మనుషులని.

అనుకోకుండా ఫణి దార్లో ఎదురయ్యాడు సూట్ కేసుతో. హైద్రాబాద్‌కు పనిమీద పోతున్నట్లు చెప్పాడు.

"ఫణీ! మా ఆవిడ కేసులో మెడికల్ ట్రీట్‌మెంట్ రీఇంబర్స్‌మెంట్ కోసం బిల్లులు పంపాను. ఓ నలభైవేలు రావాలి- కొంచెం ఆఫీసులో కదిలిస్తావా - డబ్బు చాలా అవసరం." ప్రాధేయపడ్డాడు.

"సారీ గురూ! నాకు అస్సలు టై ముండదు." ఫణి వెళ్ళిపోయాడు.

"ఛీ! ఛీ! ఏం మనుషులు - పొరుగువాడికి సాయం చేయాలన్న జ్ఞానం లేని మనుషులు!" రావు బాధపడ్డాడు.

విజయప్రసాదు .కె.
జీవిత భీమా సంస్థ,
పి.బి. నెం: 11, పార్కురోడ్డు
కర్నూలు - 518 002.